పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

కడప కార్పొరేషన్: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక పొలాల్లోనే పంటలు వదిలేసే పరిస్థితి ఉందన్నారు. జిల్లాలో ఉల్లి, వరి, టమోటా, అరటి, చీని వంటి పంటలకు గిట్టుబాటు ధర లేదన్నారు. ప్రస్తుతం ఉల్లి క్వింటా రూ.400, పుట్టి వరి రూ.8000, టమోటా కేజీ రూ.3, అరటి టన్ను రూ.4వేలు, చీనీ టన్ను రూ.12వేలు, మొక్కజొన్న క్వింటా రూ.1600 కూడా అడిగే పరిస్థితి లేదన్నారు. సెప్టెంబర్ 3వ తేది రాజంపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉల్లి రూ.1200తో కొనుగోలు చేస్తామని, కమలాపురం, మైదుకూరులలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారని, ఇంతవరకూ కొనుగోలు మొదలు పెట్టలేదన్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు బయటి వ్యక్తులు కూడా పంటను కొనుగోలు చేయడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులు పండించిన ప్రతి పంటకు ధరల స్థిరీకరణ నిధి ద్వారా గిట్టుబాటు ధర కల్పించడం జరిగిందన్నారు. రబీ సీజన్ మొదలైనా యూరియా, డీఏపీ, అరకొరగానే రైతులకు అందుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి రైతులు పడుతున్న ఇబ్బందులను మానవతా దృక్పథంతో అర్థం చేసుకొని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మెన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిరెడ్డి, మాధవరెడ్డి, సురేష్ యాదవ్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి

పని గంటల పెంపు బిల్లును తీర్మానం చేయడం తగదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: పని గంటల పెంపు బిల్లును అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గకరమని సీఐటీయూ, రైతు సంఘం జిల్లా కార్యదర్శులు వి మనోహర్ ,బి దస్తగిరి రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో 8 గంటల పని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ఆమోదించటాన్ని వ్యతిరేకిస్తూ ఉన్నామని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం కార్మికుల చట్టాలు రద్దుచేసి 4 లేబర్ కోడ్ లను ఆమోదించిందన్నారు. కోడ్ లు అమలు చేయటంలో భాగంగానే మన రాష్ట్ర ప్రభుత్వం పనిగంటలను పెంచి కార్మికుల శ్రమను యాజమాన్యాలు మరింత దోచుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. ఎక్కువ సెలవులు పొందే విధంగా ఈ సవరణలు చేస్తున్నామని చెప్పటం కార్మికులను మోసగించటానికే అన్నారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, సీఐటీయూ నాయకులు చంద్రారెడ్డి, సుబ్బయ్య, సుంకర రవి, పవన్, ఉదయ్, కార్మికులు పాల్గొన్నారు.


అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సీజేఐపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి


అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు


అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న ఆర్‌వీఎస్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడి చేయడం ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలకు జరిగిన అవమానమని దళితమిత్ర సంఘం అధ్యక్షులు కె.రామాంజనేయులు, యువజన విభాగం అధ్యక్షుడు మురహరి ప్రవీణ్‌కుమార్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక దళితుడు ఎంత పెద్ద పదవిలో ఉన్నా దాడులను చవిచూడాల్సి వస్తుందనే విషయం ఈ సంఘటన మరోమారు రుజువు చేసిందన్నారు. ఇది వ్యక్తిపై జరిగిన దాడి కాదని, దళితుల ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై అడ్వకేట్ కిషోర్ దాడి చేయడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మనోహర్, శ్రీనివాస రెడ్డి, జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి లు ఒక సంయుక్త ప్రకటనలో ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు.

– సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం హేయనీయమైన చర్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ధర్మానికి అవమానం జరిగిందన్న పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై మతోన్మాద అడ్వకేట్ ఒకరు కోర్టులో అందరూ చూస్తుండగానే చెప్పు విసరటం దేశంలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతున్నదని తెలిపారు. దోషులపై కఠిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా సనాతన ధర్మ వాదుల్ని అరికట్టాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు బి మనోహర్, దస్తగిరి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, నరసింహ, వరలక్ష్మి, వెంకట శివ, శ్రీరామ్ నాయక్, భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై బూటుతో దాడి చెయ్యడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడి చేసిన నిందితుడిని ఉరి తీసి న్యాయ వ్యవస్థను కాపాడాలని ఆర్‌వీఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్లెల జగదీష్ డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని అంబేద్కర్ సర్కిల్ లో రాయలసీమ విద్యార్థి సమాఖ్య(ఆర్‌వీఎస్) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్‌వీఎస్ నగర కార్యదర్శి దిలీప్, నగర నాయకులు మధు, బాస్కర్, అనిల్, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

– అంబేద్కర్ సర్కిల్‌లో మంగళవారం న్యాయవాదులు నిరసన తెలిపారు.

సీజేఐపై దాడి దేశ ప్రతిష్టకు మాయని మచ్చ

కడప కార్పొరేషన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి దేశ ప్రతిష్టకే మాయని మచ్చ అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సింగమాల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. భారత దేశ అత్యున్నత న్యాయ స్థానమైన సుప్రీం కోర్టు హాలులోనే ప్రధాన న్యాయమూర్తిపైనే బూటు విసిరేసి దాడికి పాల్పడటం అమానవీయమన్నారు. సనాతన ధర్మాన్ని విమర్శిస్తే సహించేది లేదని మతోన్మాది కిషోర్ రాకేష్ కేకలు వేయడం బరితెగింపునకు నిదర్శనమన్నారు.

పౌర్ణమి పూజలు

కడప సెవెన్‌రోడ్స్ : పౌర్ణమి సందర్భంగా కడప శ్రీ విజయదుర్గమ్మ ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. తొమ్మిది పవిత్ర కలశాలతో అమ్మవారికి నవ కలశ స్నపనం నిర్వహించారు. ఉదయం చండీహోమం వైభవంగా నిర్వహించారు. ఆ తర్వాత మధ్యాహ్నం రాహుకేతు పూజలు నిర్వహించారు. 108 దీపాలతో 108 మంది ముత్తైదువులతో అష్టోత్తర దీపాలంకార సేవ కన్నుల పండువగా నిర్వహించారు.



అధికారుల నిర్లక్ష్యం వల్లే రహదారిపై నీళ్లు

మైదుకూరు : మున్సిపల్, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతోనే పట్టణంలోని బద్వేలు రోడ్డుపై నీరు ప్రవహిస్తోందని సీపీఎం నాయకులు ఆరోపించారు. బద్వేలు రోడ్డులోని పొట్టి శ్రీరాములు (మార్కెట్) కూడలిలో సోమవారం నుంచి వర్షపు నీరు ప్రవహిస్తుండటంపై సీపీఎం నాయకులు అధికారులపై మండిపడ్డారు. వర్షపు నీటిలో నిలబడి మంగళవారం సీపీఎం నాయకులు అధికారుల తీరుపై నిరసన తెలిపారు. వంకలు, వాగులు, మురుగు నీటి కాలువలపై ఒక వైపు మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని ఆరోపించారు. మరో వైపు అక్టోబర్‌లో వర్షాలు కురుస్తాయని తెలిసినా ఇరిగేషన్ అధికారులు ఎర్ర చెరువును తెలుగుగంగ నీటితో నింపారని, సోమవారం కురిసిన భారీ వర్షంతో చెరువు నిండి అలుగు పారిందన్నారు. అలుగు వంక ఆక్రమణలకు గురికావడంతో అలుగు నీరు వెళ్లే మార్గం లేక జాతీయ రహదారిపై ఉన్న పొట్టిశ్రీరాములు కూడలి పరిసర వీధుల్లోని ఇళ్లలోకి నీరు చొచ్చుకుపోయిందన్నారు. ఇప్పటికైనా అలుగు వంక ఆక్రమణలు తొలగించి అలుగు నీరు పారేందుకు శాశ్వత చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి షరీఫ్, నాయకులు గురవయ్య, జహంగీర్ బాషా, హుస్సేన్, శివయ్య డిమాండ్ చేశారు.


వర్షం నీటిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సిమెంట్ రోడ్లను ఏర్పాటు చేయండి



సాయి నగర్ వీధుల్లో నిలిచిన వర్షపునీరు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగర శివారులోని 45వ డివిజన్ సాయి నగర్ లో సిమెంట్ రోడ్లను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న వీధుల్లో సిమెంట్ రోడ్లు లేకపోవడంతో వర్షాకాల సమయంలో ప్రజలు నడవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత వర్షాకాల సమయంలో వర్షపు నీరు వీధులలో నిలవడంతో ప్రజలు నడవడానికి సైతం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో మురికి కాలువలు కూడా లేకపోవడంతో ఎక్కడి వర్షపు నీరు అక్కడ వీధుల్లో నిలిచి దోమలు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక అధికారులు స్పందించి సాయి నగర్ వీధుల్లో సిమెంట్ రోడ్లు నిర్మించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛత పాటించాలి


పాత బస్టాండ్‌లో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: స్వచ్ఛత విషయంలో జపాన్ ప్రజలను మనం స్ఫూర్తిగా తీసుకోవాలని జాతీయ సేవా పథకం సమన్వయ కర్త డా.వెంకటరామిరెడ్డి చెప్పారు. మంగళవారం కడప నగరంలోని పాత బస్టాండ్ పరిసర ప్రాంతాలలో యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం, సమన్వయ కర్త డా.ఎన్ వెంకట రామి రెడ్డి ఆధ్వర్యంలో కడప ప్రభుత్వ జూనియర్ బాలికల, బాలురు కళాశాల వలంటీర్లు 200 మంది స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్- 162 ఆధ్వర్యంలో 350కిలోల ప్లాస్టిక్ వస్తువులను, చెత్త, వ్యర్థ పదార్థాలను విద్యార్థులు సంచులలో నింపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సూర్యారావు, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా గోవింద రెడ్డి, షకీల బేగం, రాజారావు వారి కళాశాలల వలంటీర్ల తో కలిసి పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామాయణాన్ని అందించిన గొప్పకవి వాల్మీకి


వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పరిశోధన కేంద్రం సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: నవరసాలతో కూడిన రసరమ్యమైన రామాయణాన్ని అందించిన ఆదికవి వాల్మీకి మహర్షి అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.చింతకుంట శివారెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం మంగళవారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో వాల్మీకి మహర్షి జయంతిని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముందుగా పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

శక్తి యాప్ మహిళలకు అండ


సమావేశంలో మాట్లాడుతున్న శక్తి టీం మహిళా ఎస్ఐ శాంతమ్మ

కడప ఎడ్యుకేషన్: శక్తి యాప్ మహిళలకు కొండంత అండ అని శక్తి టీమ్ మహిళా ఎస్ఐ శాంతమ్మ పేర్కొన్నారు. మంగళవారం కడప నగరశివార్లలోని శ్రీనివాస ఇనిస్టూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సు ఇంజనీరింగ్ కళాశాలలో ‘శక్తి’ యాప్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శాంతమ్మ మాట్లాడుతూ శక్తి యాప్ మహిళలు, బాలికల రక్షణతోపాటు ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఏదైనా అపాయం, అనుకోని ఘటన జరిగి ప్రమాదంలో ఉన్నప్పుడు శక్తి యాప్ ద్వారా తక్షణ సాయం పొందవచ్చన్నారు. ఎస్ఓఎస్ బటన్ డయల్ 112 నెంబర్‌కు కాల్ చేసిన కేవలం 10 నిమిషాల్లో మీ చెంతకు పోలీసులు చేరుకుని సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారన్నారు. అలాగే మహిళలు చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలపై డయల్ 100,112, చైల్డ్ లైన్ 1098, గృహ హింస 181, మహిళ వేధింపులు 1091,సైబర్ టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్ర, సంబంధిత పోలీసు అత్యవసర సేవల గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ నాగమల్లికార్జున, శక్తి టీం సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: కడప 27వ డివిజన్ గౌసనగర్ పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న విద్యావాలంటీర్లకు వేతనాలను మంజూరు చేయాలని గౌసనగర్ ముస్లిం మైనార్టీ నాయకులు లయన్‌ఫటాన్ ఖాదర్ బాష, షేక్ అమానుల్లాలు కోరారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ గౌసనగర్ పరిధిలోని ఉర్దూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఆరుమంది విద్యావాలంటీర్లు పని చేస్తున్నారన్నారు. వీరికి గత 5 నెలల నుంచి కార్పొరేషన్ వారు వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. ఇలాంటి సమస్య ఒక్క గౌస్ నగర్ పరిధిలోని పాఠశాలలోనే కాకుండా కడప నగర పరిధిలోని 50 డివిజన్ల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న విద్యా వాలంటీర్లకు జీతాలు చెల్లించాల్సి ఉందన్నారు. నేడు జరిగే నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశంలో వాలంటీర్ల వేతనాలపై చర్చించాలని కోరారు.

సెక్యూరిటీ బాధ్యతలు పకడ్బందీగా నిర్వహించాలి


సెక్యూరిటీ సిబ్బందికి యూనిఫామ్ అందజేస్తున్న రిమ్స్ అధికారులు

కడప అర్బన్: కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఆవరణంలో సెక్యూరిటీ బాధ్యతలను పకడ్బందీగా నిర్వహించాలని కడప రిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ రంగస్వామి తెలియజేశారు. నూతన ఏజెన్సీగా వచ్చిన ఈగల్ సెక్యూరిటీ సంస్థ ప్రతినిధి శంకర్ ఆధ్వర్యంలో సెక్యూరిటీ సిబ్బందికి యూనిఫామ్ ను మంగళవారం డిప్యూటీ డైరెక్టర్ రంగస్వామి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీడీ విజయలక్ష్మి, ఓ.ఎస్ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నగరంలో నేటి నుంచి ఆధార్ శిబిరాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా బుధవారం నుంచి ఈ నెల 14 వరకు నగరంలో మొబైల్ ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో 8, 9 తేదీల్లో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, 10, 11న బాలికల ఉర్దూ పాఠశాల, 13, 14 న సాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆధార్ శిబిరాలు ఉంటాయన్నారు. ఈ శిబిరాల్లో 5 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితంగా అందిస్తామన్నారు. 7 నుంచి 15 సంవత్సరాల పిల్లలకు ఎంబియు-1 అప్‌డేట్‌లను సదురు చార్జీల ప్రకారం సేవలను అందిస్తామన్నారు. 10 సంవత్సరాల బాలికల కోసం సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు, బాలుర కోసం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలు తెరవడానికి ఈ శిబిరంలో సదుపాయం కల్పించామన్నారు.

ఘన సన్మానం


యానాదయ్యను సన్మానిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన టీటీడీ బోర్డు మాజీ సభ్యులు ఎస్ యానాదయ్యను మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా ఘనంగా సన్మానించారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయనకు శాలువా కప్పి పూలమాల వేసి సన్మానించారు. అంజద్‌బాష మాట్లాడుతూ బీసీ నేత యానాదయ్యను ఎస్ఈసీ మెంబర్‌గా నియమించడం సంతోషదాయకమన్నారు. ఆయన ఇలాంటి పదవులు మరెన్నో పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివ ప్రసాద్, కార్పొరేటర్ ఆరీపుల్లా బాషా, జెడ్పీటీసీ ఏ. రామక్రిష్టారెడ్డి, పార్టీ నాయకులు ఆర్‌వీ రమణ, బాల కొండయ్య, వెంకటేష్, పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష సూచించారు. మంగళవారం కడపలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో జీఎస్టీ పై అవగాహన సదస్సును నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం, కళాశాల విద్య ఆదేశాల మేరకు ×సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే అంశంపై కామర్స్ , ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వపు పోటీలను నిర్వహించారు. పోటీలో ఎస్ బి బి ఆయేషా ప్రథమ బహుమతిని, ఎస్ సానియా ద్వితీయ బహుమతిని, టి. దుర్గాదేవి తృతీయ బహుమతి సాధించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని తెలుగుశాఖలో తెలుగు అతిథి ఉపన్యాసకులు(గెస్ట్ లెక్చరర్) నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష తెలిపారు. పిహెచ్‌డి, నెట్, సెట్ అర్హతలతోపాటు బోధనా అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, సంబంధిత ధ్రువ పత్రాలతో కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 9వ తేదీలోపు అందచేయాలని తెలిపారు.

ఆర్టీసీని ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న పొలిమేర గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీని ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దేందుకు డ్రైవర్లు కృషి చేయాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరంలోని ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ప్రమాదాలు చేసిన డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు విధి నిర్వహణలో ఏకాగ్రతతో ఉండాలన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉండడంతోపాటు డ్రైవింగ్‌లో మెళుకువలను పాటించాలన్నారు. తొలుత ఓం శాంతి సంస్థ ప్రతినిధులు డ్రైవర్లతో ధ్యానం చేయించారు. డిపో మేనేజర్ రామకృష్ణ ఇంధన పొదుపుపై డ్రైవర్లకు పంచ సూత్రాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు కృష్ణారెడ్డి, పులివెందుల డిపో ఎస్‌డీఐ ఎంజీ రెడ్డి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి

కడప రూరల్: ప్రజలు గంజాయి, మాదకద్రవ్యాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని నార్కోటిక్ సెల్ ఏఎస్ఐ మల్లయ్య తెలిపారు. మంగళవారం స్థానిక వికలాంగుల కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎం లకు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి ఇతర మాదకద్రవ్యాలు కలిగి ఉన్నా, రవాణా చేసినా చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇందుకు సంబంధించిన సమాచారం ఏదైనా ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు ఫోన్ చేసి తెలపాలన్నారు. అదేవిధంగా ఈగల్ సోషల్ మాధ్యమాలకు సంబంధించిన క్యూఆర్ కోడ్ గురించి వివరించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలపై అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనూష, అయుబ్ ఖాన్, గురు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరం


విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

కడప ఎడ్యుకేషన్: కడప శంకరాపురంలోని ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయులు వేపరాళ ఎబినేజర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ రిమ్స్ హాస్పిటల్ దంత వైద్యులు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పిల్లలను పరీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. దంత సంరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు చైతన్య దీప్తి, హారిక, దీక్షిత, రాహుల్, అబ్దుల్లా, యామిని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెడ్ టీచర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగేలా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ ఈదురు బాషా పేర్కొన్నారు. మంగళవారం కడపలోని బాలవికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. బాగా చదువుకుని సమాజానికి, దేశానికి సేవ చేయాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశల్ని, ఆశయాలను నెరవేర్చేలా మీ వంతు కృషి చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. పోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్ - 112, రహదారి భద్రత, సోషల్ మీడియా - సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియచేశారు.

హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ

సిద్దవటం : మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను మంగళవారం అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి మహాలక్ష్మి తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతిగృహాలలో మౌలిక వసతులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని విద్యార్థులు పాఠశాలకు వెళ్లేటప్పుడు ప్రతి విద్యార్థి అటెండెన్స్ కచ్చితంగా తీసుకోవాలన్నారు. వసతి గృహాలలో విద్యార్థుల ముఖచిత్ర అటెండెన్స్ త్వరలో అందుబాటులోకి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

లైఫ్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో జాతీయ తపాలా వారోత్సవాలల్లో భాగంగా ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యుత్తమ పోస్టల్ లైఫ్ ఇన్స్రూ పాలసీదారులు అనూషకు గౌరవప్రదంగా పీఎల్ఐ బాండ్‌ను అందజేశారు.